

మంత్రిప్రగడ సూర్యప్రకాశరావు

“పెద బాబూ! హాస్పిటల్‌కు వెళ్తావురా, మధ్యాహ్నం భోజనం పట్టుకు వెళ్ళాలి,” మేడ మెట్లు ఎక్కబోతున్న కొడుకును అడిగింది జానకమ్మ.

“అమ్మా! ఈ పూట పొందు

కియ్యవే, నాకు పనుంది'' అన్నాడు విసుగ్గా.

''ఏం పన్రా! ఎంత అర ఘంటలో వెళ్ళి వచ్చెయ్యొచ్చు సైకిల్ మీద వెళ్తే'' అంది బ్రతిమాలుతున్న ధోరణిలో.

''అబ్బ! సైకిల్ మీద వెళ్తే ఎండే! ఇంత ఎండలో. అంతదూరం సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళాలి. పాండుగాడేం చేస్తున్నాడు. వాడ్నెళ్ళమను. ఒరే పాండూ వెళ్ళరా'' తమ్ముడికి పురమాయించాడు పెదబాబు.

''నేను ప్రొద్దున్న టిఫిన్ తీసుకెళ్లాను ఈ పూటను వెళ్ళకూడ దేంటి? నేనే కవి పిస్తాను అందరికీ'' అన్నాడు విసురుగా పాండు.

''నేనిప్పుడు వెళ్ళలేను...ఎవరెళ్తారో వెళ్ళండి నాకిప్పుడు అర్జంటు పనుంది.'' అని చెప్పులు టకటక లాడించుకుంటూ మేడ మీదకు వెళ్ళిపోయాడు పెదబాబు.

కొడుకుల ధోరణికి నిర్ఘాంతపోయింది జానకమ్మ? [illegible] ''ఒరే చిన్నా ఎలా [illegible] ఇప్పుడే వస్తాం [illegible] పోయింది. ప్రొద్దున [illegible] రొట్టెలని పొద్దు [illegible] ఇప్పటివరకు అలా ఆకలితో ఉండాలి. పోనీ ఒక్కసారికి మళ్ళీ వెళ్ళొచ్చెయ్యరా'' అంది బ్రతిమాలుతూ.

''అమ్మా! ఏంటీ రోజూ నన్నే వెళ్ళమంటావు. ఇంకెవరూ దొరకలేదుకాబోలు పోనీ ఈ పూట అక్కడ పేకాడుకుంటున్న వాళ్లలో ఏ ఒక్కర్నయినా వెళ్ళమన కూడదూ వాళ్లెందు కొచ్చారమ్మా నాన్నకు జబ్బుగా ఉందనేకదా చూడ్డానికి కొచ్చారు. మాత్రం సాయం చెయ్యలేరా?''

''నెమ్మదిగా మాట్లాడరా వాళ్ళకు విని పిస్తుంది. వాళ్ళంతా చుట్టం చూపుగా వచ్చిన వాళ్లు, వాళ్ళను ఆ పని చెయ్యమని ఎలాపురమాయించేది చెప్పు వాళ్ళకు వాళ్ళు తెలుసుకొని చెయ్యాలిగాని మనం చెప్తామా?'' అంది.

''నే నిప్పుడే వెళ్ళలేనమ్మా. నాకు ముఖం తిరుగుతున్నది. నిన్నంతా నిద్ర లేదు. నాకు నిద్రొస్తున్నాది నన్నేం అన కమ్మా!'' అంటూ తన గదిలోకి వెళ్ళి పోయాడు పాండు.

''వెధవా! నిద్రొస్తున్నదా! సెకండ్ షో సినిమాలకు వెళ్ళడానికి నిద్ర రాదుగాని ఏదైనా పని చెప్తే మాత్రం నిద్రొస్తుంది'' గొణుక్కుంది జానకమ్మ. కొడుకుల ధోర ణికి ఆమె మనస్సు గాయపడింది.

'ఈ వెధవలకోసమా తామింత శ్రమ పడింది. వీళ్ళ చదువులకోసం వీళ్ళ బాగోగుల కోసం తమ కోరికల్ని చంపు కుని, సుఖాలకు దూరమయి వాళ్ళకు కష్ట మన్నది తెలియకుండ గడుపుకొస్తుంటే వీళ్ళు కొంచమైనా బాధ్యత లేకుండ వ్యవ

హరిస్తున్నారు. హాస్పిటల్లో ఉన్న తండ్రికి భోజనం పట్టుకెళ్ళమంటే వీళ్ళకు విసుగొచ్చింది అర్జంటు పనులు అడ్డొచ్చాయి. అనుకుంది బాధపడింది.

'పోనీ తన అన్నకొడుకు రామాన్ని వెళ్ళమంటే' అనుకొంది. ''రామం''అని పిల్చింది.

ప్రక్క గదిలోనుండి "వస్తున్నా నత్తా'' అంటూ వస్తున్న రామం అడుగు చప్పుడు వినిపించింది. కాని....ఆ అడుగులు గుమ్మం దాటి రాలేదు.

''ఎక్కడికిరా వెధవా అంత పరుగు మీద వెళ్తున్నావు కేరీజాలు మోసుకు తిరుగు తావా?'' ఏమిటి?'' తలుపు ప్రక్క నుండి వదిన కామాక్షి. మాటలు వినిపించాయి అస్పష్టంగా.

''రామం'' అని మళ్ళీ పిల్చింది జానకమ్మ

తల్లి ఏదో హిత బోధ చేసి పంపినట్లుంది. "ఏమత్తా'' అంటూ వచ్చాడు.

''మావయ్యకు కేరీజా పట్టుకెళ్తావురా?'' అంటే

"మావయ్యా కా హాస్పిటలు త్రోవ సరిగ్గా తెలీదత్తా'' అన్నాడు తడుముకోకుండా.

"అప్జల్‌గంజి జంక్షన్ వద్ద బస్ దిగి ముందుకు నాలుగడుగులు వేస్తే ఎదురుగానే కనిపిస్తుంది ఉస్మానియా హాస్పిటల్ అవును మొన్న సాయంత్రం మాతో హాస్పిటల్‌కు నువ్వు వచ్చావు కదురా? తెలీదంటావేం?'' అంది.

''నాకు వంట్లో బాగు లేదత్తా....జ్వరం వచ్చినట్లుంది. నాన్నను పిలుస్తానుండు.'' అని పాఠం అప్పచెప్పినట్లు చెప్పి వెళ్ళి పోయాడు.

జానకమ్మ నిర్ఘాంతపోయింది. 'ఇంత వరకూ లతతో కేరమ్సు ఆడాడు ఇప్పుడే వీడికి జ్వరం వచ్చిందా? తల్లి ఏదో హిత బోధ చేయగానే వంకలుపెట్టి తప్పించుకున్నాడు.' అనుకుంది. ఆ క్షణంలో జానకమ్మకు రామం మీద, తన వదిన మీద ఎంతో కోపం వచ్చింది. 'తన కూతురికి ఇలాంటి మొగుడు ఇలాంటి అత్త దొరికితే ఇక చెప్పక్కర్లేదు. అవసరాలు వచ్చినప్పుడు మాత్రం తీపికబుర్లు ఆడతారు తీరా ఆ అవసరం

నిజమైన బంధువులెవరో ఆపద సమయంలోనే తెలిసివస్తుంది.

ఆత్మీయునిగా ఆదుకొన్న ఆదర్శవంతుడే నిజమైన ఆత్మబంధువు.

తీరిపోగానే అంటే ముట్టనట్టుంటారు. తన కూతురు లతనేమో పీడికివ్వాలట దగ్గరవాళ్ళం కదావి కట్నం పదివేలే ఇచ్చినా సరే చేసుకుంటారట. ఇప్పుడు పీడికి పిల్లనివ్వాలనే కూర్చున్నాం. బోడి గాడు. అడ్డగాడిదలా ఉండి అమ్మకొంగు పట్టుకొని తిరుగుతాడు. ఆవిడగారేమో పెద్ద లీడర్‌లా కబుర్లు చెపుతుంది.'

ఆలోచనకంత రాయంగా "ఏవమ్మా పిలిచావట" అంటూ వచ్చాడు పెద్దన్నయ్య ప్రసాదరావు చేతిలో పేక ముక్కలతో.

"ఆ....ఏమీ లేదురా....బావగారికి కేరీజా పట్టుకెళ్ళడానికని...." అంటూ నసిగింది.

"కేరీజా పట్టుకెళ్ళడానికా....హోరి ఇంకేదో కొంపలు మునిగిపోయే పనేమో అనుకుని వచ్చాన్నేను. ఈ మాత్రం దాని కోసం నా సలహో... కావాలా....ఇలా గైతే ఎలాగమ్మా...అవును ఇంట్లో ఉన్న గుంటవెధవ లందరు ఏమయ్యారు. పెదబాబు....చినబాబు ఏరీ? చినబాబూ.... చినబాబూ" అంటూ పిలిచాడు.

"చినబాబుకు వంట్లో బాగులేదట" అంది నెమ్మదిగా.

"వంట్లో బాగులేదూ....వెధవకి.... అంతా వేషాలు....సినిమా కంటేమాత్రం టంగుమని గంటకొట్టి నట్టు లేచికూర్చుం టాడు. ఏదైనా పనిచెప్తే మాత్రం జ్వరా లొస్తాయి" కోపంగా ఇంకా ఏదో అన బోయాడు.

"రామం కూడ అలాగే అన్నాడ్రా వంట్లో బాగాలేదని" అంది


"అవునే నిజంగా వాడికి వంట్లో బాగు లేదు. ఇందాకట్నుంచి కడుపు నొప్పితో బాధపడ్తున్నాడు. ఆ వెధవని డాక్టరు దగ్గ రకు తీసికెళ్ళి చూపించడానికూడ నాకు తీరికవడం లేదు" అన్నాడు ఎంతో బాధ పడ్తున్న వాడిలా ముఖం పెట్టి.

"ఏమిటీ? నీకు తీరికుండడం లేదా?" అంటూ చేతిలోని పేకముక్కల వైపు చూపింది.

"వాడికి కడుపునొప్పి కాదురా.... జ్వరం అని చెప్పాడు" అంది.

"ఆఁ ఆ. జ్వరమే కాబోలు కడుపు పట్టుకొని బాధపడుతుంటే కడుపు నొప్పి అనుకున్నాను. ఆ.... వస్తాను.... నా రౌండ్ వచ్చేసినట్లుంది" అంటూ వెళ్ళి పోయాడు.

వెళుతున్న ప్రసాదరావు వైపు చూ స్తున్న జానకమ్మకు అసహ్యం వేసింది. "ఈ లాయరుగార్ని సలహా అడగటానికి పిలిచాననుకున్నాడు కాబోలు. బావగారికి భోజనం తీసుకెళ్ళి ఇవ్వటానికి నామోషీ వేసింది. కాని బావ యింట్లో నెలలతరబడి పెళ్ళాం పిల్లలతో తిని కూర్చోడానికి మాత్రం నామోషీ లేదు" అనుకుంది




ప్రసాదరావెళ్ళి పేకాడుతున్న వాళ్ళతో ఏదో చెప్పాడు కాబోలు "నేను మేట్నీకి వెళ్ళేటప్పుడు తీసుకెడతాను ఉంచొదినా" అంటూ వచ్చాడు మరది రాజారావు.

వచ్చినవాడు ఊరుకోకుండా చిన్న ఉపన్యాసం ప్రారంభించాడు.

"ఎవడికీ బొత్తిగా హ్యూమేనిటీ, కర్టసీ లేకుండాపోతోంది. అవతల జబ్బుమనిషి ఆకలితో హాస్పిటల్లో వుంటె. భోజనం తీసుకెళ్ళి యివ్వటానికి ఎవరికీ తీరికలేనంత పనుల్లో వున్నారు. ఒకడికేమో జ్వరం, మరొకడికేమో కడుపు నొప్పి. ఇంకొకడికి అర్జంటు పని. ఆ తర్వాత ఇంకొకడికి పెళ్ళాంతో కబుర్లు చెప్పుకుంటూ కూచోడం. పేకాట ఆడటం తప్పని సరి. ఇలా వున్నారు అందరూ. అలా ఉంచొదినా నేను సరిగ్గా రెండుగంటలకొస్తాను కేరేజీ తీసుకెళ్ళి అన్నయ్యకిచ్చేసి అలా మేట్నీకి ఏ సినిమాకన్నా పోతాను"

"అదికాదయ్యా! ప్రొద్దుననగా ఆయన టిఫిన్ తిని ఇప్పటివరకూ అలా ఉండిపోయారు. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. బాబ్బాబూ ఒక్కమాట వినవు అలా వెళ్ళి వచ్చెయ్యి" ప్రతిమాలింది.

రాజారావు నవ్వాడు "ఏమిటి వదినా నీ చాదస్తం. కొంపలు మునిగిపోతున్నట్లు ఏంటా గాభరా? అసలు రోగంతో ఉన్న వాళ్ళను కొంచెం ఆకలితోనే ఉంచాలి. వాళ్ళకు తిండికూడ ఆరారగానే పెట్టాలి. లేకపోతే రోగానికి బలంవస్తుందట. మరి జ్వరం వచ్చిన వాళ్ళకు లంఖనాలు

ఎందుకు పెడతారనుకున్నావ్. అది అలా ఉంచు నే వచ్చి తీసుకెళ్తాగా'' నమ్మకంగా చెప్పి గదివైపు తిరిగాడు.

''పోన్లే నాయనా! నువ్వు తీసుకెళ్లొద్దులే.... ఆయనకు ఆకలి అని నేనంటూంటే నువ్వేమో ఆరారగా పెట్టాలి అంటావు. నీ పనేదో నువ్వు చూసుకో! వెళ్లేటప్పుడు ఆ వెంకటేశంగాడిని ఒకసారి నేను రమ్మన్నానని చెప్పు'' అంది జానకమ్మ.

వెంకటేశం వచ్చాడు హడావిడిగా. ''ఏం పిన్నీ అర్జంటుగా రమ్మని పిలిచావట. నిజంగా అంత అర్జంటా.... నేను మంచి మూడ్‌లో కథ రాస్తున్న సమయంలోనే పిలిచావు. వేగంగా చెప్పెయ్ పిన్నీ అలకించి వెళ్ళిపోవాలి'' అన్నాడు కమెడియన్ పోజులో నిలబడి.

''హాస్పిటల్‌కు వెళ్ళాలిరా....''

''హాస్పిటల్‌కా.... నేనా? నేను హాస్పిటల్‌కు వెడితే చూసినవాళ్ళు ఏమనుకుంటారు? వీడికేం జబ్బు! జరవా? అనిఅనుకోరూ? అబ్బ నాకు సిగ్గేస్తుంది నేవెళ్ళ'' గారాబంగా అన్నాడు.

''అబ్బ! డ్రామాలు వెయ్యకురా. మామయ్యకు కేరీజా తీసుకెళతావని పిలిచాను'' అంది.

''నేనా! కేరీజా పట్టుకెళ్లాలా.... కేరీజా పట్టుకెళ్లటం అంత అర్జంటా ఏంటి పిన్నీ నువ్వుకూడి జోక్స్ వేస్తున్నావు.''

''చిన్నాన్నకు భోజనంరా.... ఇప్పటికే బాగా ఆలస్యం అయిపోయింది.''

''కేరీజా పట్టుకెళ్లాలని నాక్కూడ ఉందనుకో. కాని నా పర్సనాలిటీ చూడు పిన్నీ... నేను కేరీజా మొయ్యలేనే. స్కూలు పుస్తకాలు పట్టుకెళ్ళడానికే నాకు ఆయాసం వస్తుంది. అయినా నేను జబ్బు మనుషుల్ని చూడకూడదట. చూస్తే నాకు మొకం తిరుగుతుందట. అందుకే మొన్న మా అమ్మా నాన్నా ఆస్పిటలుకి వెళ్ళినప్పుడు నన్ను తీసుకెళ్లలేదు. అదీ కాక నేనిప్పుడు బజ్జుంటేనే మా నాన్న రాత్రి సినిమాకు తీసుకెళతానన్నాడు. లేకపోతే నేను సినిమాలో నిద్రపోతానట. నే వెల్తా పిన్నీ.... అనవసరంగా నా మూడ్స్ ఆన్నీపోయాయి. ఇప్పుడు సీత మీద కథెలా వ్రాయాలి'' అని నాలిక కొరుక్కున్నాడు.

''సీతెవర్రా?''

''సీత.... సీతంటే ఆ ఎదురింట్లో ఉన్న చీపికళ్ళమ్మాయి. లావుగా ఉంటుందది.... పిన్నీ పిన్నీ! ఈ సంగతి మా అమ్మకు చెప్పొద్దు పిన్నీ. చెపితేనిజంగా ఆ అమ్మాయినిచ్చి పెళ్ళిచేసేస్తుంది. ఆ పిల్లదగ్గర నిలబడ్డానికి నాకు సిగ్గేస్తాది.... వస్తా పిన్నీ.... ఇప్పటికే ఆలస్యం అయింది.''

ఎంత హడావుడిగా వచ్చాడో అంత హడావుడిగా వెళ్లిపోయాడు వెంకటేశం.

''వెధవకు పదిహేనేళ్ళుపై బడ్డా ఇంకా వెర్రిమొర్రి అవతారంలానే మాట్లాడతాడు'' అనుకుంది జానకమ్మ.

టైము చూపింది. పావుతక్కువఒంటి

గంటయింది. "ఏమిరా భగవంతుడా! ఇక కేరీజు తీసుకెళ్ళేవాళ్ళెవరున్నారు? పోనీ రామారావుని పిలిస్తే" అనుకుంది.

గదిలో పేకాట మంచి రసపట్టులో వుంది. అందరూ దీక్షగా ఆడుతున్నట్టు కనిపిస్తున్నారు. మగాళ్ళు ఆడుతూంటే ఆడవాళ్ళు వెనక కూర్చుని సలహాలిస్తున్నారు. తను గదిలోకి వచ్చిన సంగతే ఎవరూ పట్టించుకోలేదు.

రామారావు తనవైపు చూస్తే పిలుదామనుకుంది. కాని అతను చాల సీరియస్‌గా ఆడుతున్నాడు. పోనీ ఆట అయాక పిలుద్దాం అనుకొంది.

ఆట అయినట్టుంది. రామారావే గెల్చాడు. అందరివగ్గరాడబ్బులు వసూలు చేసుకుని ముక్కలు క్రింద పారేస్తూ "నేను మానేస్తాన్రా.... మీరు ఆడుకోండి" అని లేచిపోయాడు.

"పోనిలే తను పిలవకుండానే వస్తున్నాడు" అనుకుంది జానకమ్మ.

"ఏమేవ్! లెగు అలాకూర్చున్నావేం, గెల్చిన డబ్బులు చాలుగాని ఇక లెగు. బస్సుకు టైమవుతూంది. గోల్కొండ వెల్దామన్నావు" అన్నాడు భార్యతో.

ఇంకా ఆడితే బాగుండును అని కూర్చున్న రామారావు భార్య అంటే తన ఆడపడుచు గోల్కొండ అని అనగానే గబుక్కున లేచింది.

"గోల్కొండ వెళతారా! ఇంకానయం కేరీజు పట్టుకెళ్ళమని అడిగాను కాదు" అనుకుంది జానకమ్మ.

మిగిలిన వాళ్ళంతా సర్దుకుని ముక్కలు పంచుకుంటున్నారు. తను ఆ గదిలో కొచ్చిన సంగతిగాని, మధ్య హాలులో తను అందర్నీ బ్రతిమాలుకున్న సంగతిగాని పట్టించుకోనట్టు ఆటలో మునిగిపోయారు అంతా.

మధ్య హాలులో తల పట్టుకుని కూర్చుంది జానకమ్మ. "ఇంకెలారా దేవుడా



ఇంకెవరున్నారు కేరీజు తీసుకెళ్లేవాళ్లు. ఇంతమంది చుట్టాలు.... రక్తం పంచుకు పుట్టిన అన్నదమ్ములు, కొడుకులు. ఆప్యాయత ఒలకబోసే బావమరదులు వీళ్ళ పిల్లలు యింతమందివున్నా ఆయనకు వేళకు భోజనం తీసుకెళ్లే దిక్కు లేకపోయింది. మరి వీళ్లంతా ఎందుకొచ్చినట్టు? వాళ్ళ కోర్టుపనులు చూసుకోడానికీ, పెళ్ళి సంబంధాలు కుదుర్చుకోడానికి.... హైదరాబాద్ చూడ్డానికీ... షికార్లు కొట్టడానికేనా వాళ్ళు వచ్చింది. ఏదో ఉద్ధరించడానికన్నట్టు మందలు మందలుగా వచ్చిపడ్డారు వెలిబోజాల ప్రేమే.... వీళ్లందరికీ వేళకి కాఫీలు, టిఫెన్లు, భోజనాలు అన్నీ అమర్చిపెట్టేసరికి తనకు కాళ్లూ చేతులూ లాక్కుపోతున్నాయి. ఒక్కరుకూడ ఏ పని లోనూ చేయికోరు. తానే పనంతా చేసుకొని, ఆయనకు హాస్పిటల్‌కు అన్నివేళకు తయారుచేసి పంపించాలి. వీళ్ళు మాత్రం వారానికి రెండుసార్లు వంతుల వారీగా హాస్పిటల్‌కు వెళ్ళి చూసి వస్తారు. అంతే వాళ్ళుచేసే సహాయం. ఈ ఒక్కటైనా సాయం చెయ్యమని తను నోరు తెరచి అడిగినా ఏ ఒక్కరూ పట్టించుకోరు వీళ్లా బంధువులు.... బంధుభక్షకులు.... వీళ్ళు రాబందులు....''

గడియారం ఒంటిగంట కొట్టేసరికి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుంది. ఆమెకు ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

''ఒంటిగంటయిపోయింది. ఇప్పుడెలారా దేముడా!.... పోనీ ఈ వెధవలు వీళ్ళందర్నీ బతిమాలుకునే బదులు నేనే వెళ్ళివచ్చేస్తాను'' అనుకుంది.

చెప్పులు తొడుక్కుని వెళ్లబోయేసరికి గేటు తెరచుకొని లోపలకు వస్తున్న భాస్కరం కనిపించాడు. చెమటలుక్రక్కుకుంటూ వచ్చిన భాస్కరం సైకిల్ని గుమ్మం ముందు పెట్టి స్టాండువేశాడు. లోపలకి వచ్చి సోఫాలో కూలబడి మంచి నీళ్ళు కావాలని సైగచేశాడు.

జానకమ్మ మజ్జిగకలిపి తీసుకొచ్చింది. అంతా త్రాగేసి 'బ్రేవ్' మని తేన్చాడు. ''అమ్మయ్య మొత్తానికి వెళ్ళిన పని యింది'' అన్నాడు. అతని ముఖంలో సంతృప్తి కనిపించింది.

''ఏంటిభాస్కరం'' అంది జానకమ్మ.

'ఆ ఏంలేదు. వాడికి డాక్టరు ఏవో రెండు ఇంజక్షన్లు రాసారు. ఆ రెండు ఇంజక్షన్లు ఎన్ని షాపులు తిరిగినా దొరకలేదు. స్టాకు అయిపోయిందట. ఆఖరికి దగ్గరగా వరకు వెతికి తిరిగాను స్టేషనుకు ఎదురుగా ఉన్న షాపులో దొరికింది'' అన్నాడు భాస్కరం.

''అంతదూరం సైకిలు మీద వెళ్ళా వస్తున్నావా. అయితే ఉదయంనుండి ఇప్పటివరకు అలా తిరుగుతున్నావా?''

''మరి తిరక్కపోతే ఎలా దొరుకుతుంది, ఆ ఇంజక్షన్లు అర్జంటుగా కావాలన్నాడు డాక్టరు. అందుకే శ్రమైనా తిర



గాల్చొచ్చింది. ఏమైతేనేం చివరకు ఫలితం దక్కింది గదా!" అని సంతృప్తిగా కళ్ళు మూసుకున్నాడు.

"ఇంజక్షన్లు హాస్పిటల్లో ఇచ్చేసొచ్చాను ఇంక వెళ్తాను. సాయంత్రం తిన్నగా హాస్పిటల్కు వస్తాను" అంటూ లేచాడు.

"భాస్కరం, భోజనంచేసి వెళ్ళకూడదూ...." అంది జానకమ్మ ఆప్యాయతగా.

చిన్నగా నవ్వాడు. "పరవాలేదు. ఇక్కడేగా మా యిల్లు.... మా ఆవిడ ఎదురుచూస్తుంటుంది. నే వెళ్ళేవరకూ అది భోజనం చెయ్యదు. అన్నట్టు, మీరేమిటి అలా వున్నారు? అరే! కేరీజీ యింకా యిక్కడే వుంది. ఎవరూ తీసుకెళ్ళలేదా? ఇక [illegible] కల్లా తీసుకెళ్ళవలసిన కేరీజీ యింకా యిక్కడే వుండిపోయింది. వాళ్ళేసలే ఆకలెక్కువ. ఒంటిగంట [illegible] ఇంతవరకూ ఏం చేస్తున్నారు" చిన్నగా మందలించాడు.

"ఏమి చెప్పమంటావు భాస్కరం? ఇంతమంది బంధువులూ పిల్లలూ వున్న ఇంట్లో కేరీజీ తీసుకెళ్ళే దారి లేదని చెప్ప

డానికి సిగ్గేస్తున్నది. ఎవరికీ ఏ బాధ్యతా లేదు'' ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

"చాలు చాలు ఇంకేం చెప్పొద్దు నాకంతా అర్థమైంది. ఆ కేరేజీ యిలా ఇవ్వండి నేనే వెళ్ళి ఇచ్చి వస్తాను ఈ పాటిదానికి ఇంతలా ఆలోచించాలా! నేను వచ్చిన వెంటనే ఎందుకు చెప్పలేదు సంగతి? అక్కడ ఇప్పుడు మా బ్రదర్ ఫైర్ అవుతూ ఉంటాడు.' అని కేరేజీ తీసుకొని సైకిలెక్కి వెళ్ళిపోయాడు

కొద్ది నిముషాలసేపు భాస్కరం వెళ్ళిన వేపే చూస్తూ వుండిపోయింది జానకమ్మ భాస్కరం మాటలు ఆమె చెవుల్లో ఇంకా గింగురుమంటూ వినిపిస్తూనే వున్నాయి ఆమె కళ్ళ వెంబడి ఆనందాశ్రువులు జారి పడ్డాయి

''బ్రదర్'' అని అనుకుంది. ''బ్రదర్ బ్రదర్'' అని చాలాసార్లు గొణుక్కుంది.

''భాస్కరానికి ఆయన బ్రదరా? రక్తాన్ని పంచుకు పుట్టిన పిల్లలు స్వంత అన్నదమ్ములు కూడ చేయని పనులన్నీ చేస్తున్నాడు భాస్కరం ఆయనకు ప్రాణాల మీదకు వచ్చి హాస్పిటల్లో చేర్చినప్పట్నించి భాస్కరం శలవు పెట్టుకుని ఆయన దగ్గరే ఉంది. రాత్రుళ్ళు కూడ హాస్పిటల్లోనె పడుకుని ఆయనకు అన్ని సపర్యలు చేస్తున్న భాస్కరానికి ఆయన ఏమవుతారు? భాస్కరానికి ఆయనకు గల సంబంధమిటిమేం?' అని ప్రశ్నించుకొంది

ఆమె హృదయంలో ఏదో అవ్యాజమైన ఆప్యాయత తెలియరాని చైతన్యం మొదలయింది. హృదయం ద్రవించుకుపోతున్నట్లయింది

'భగవాన్! ఈ ప్రపంచంలో రకరకాల మనుషుల్ని సృష్టిస్తున్నావు వాళ్ళ మధ్య సంబంధాల్ని ఆత్మ బంధాల్ని కూడ విచిత్రంగా కలిగిస్తున్నావు నీ సృష్టిలో అతిసహజమైన మనిషి భాస్కరం అయితే మానవత్వాన్ని నిరూపించుకోవడానికీ. కష్టాల్లో ఉన్న సాటిమానవుడికి సాయం చెయ్యడానికి ఏదైనా రక్త సంబంధమే ఉండాలా? భాస్కరం ఆయన ఫ్రెండ్స్ ఒకే ఆఫీసులో పని చేస్తున్న వాళ్ళు స్నేహం ఒక్కటే వాళ్ళకున్న సంబంధం. రక్తసంబంధాన్ని మించిన బంధం అవును భాస్కరం! నువ్వు నాకు ఏమవుతావు!' ఈ ఆలోచన ఆమెకు చాల విచిత్రంగా తోచింది.

'నువ్వు నాకు తండ్రివి అన్నయ్యవు కొడుకువు ఆత్మ బంధువు... అన్నీ నువ్వే భాస్కరం నువ్వు నాకు పసుపు కుంకుమల్ని ప్రసాదించిన దేవుడవు ఇంతకంటే నిన్నేలా అనుకోను భాస్కరం. నువ్వే గనుక లేకపోతే ఈ రాక్షసుల మధ్య నా దేవుడు నన్ను దిక్కులేని దాన్ని చేసిపోరు నీ ఋణం ఎలా తీర్చుకోను భాస్కరం '' ఆమె మనస్సు స్మరిస్తున్నది

ఆమెకు హృదయం ఆనందంతో నిండిపోయి ఎంతో హాయిగా ఉంది. తృప్తిగా ఊపిరి పీల్చుకొని విశ్రాంతిగా సోఫాలో జేరబడింది జానకమ్మ.